క్లుప్తంగా

ఓటరు స్లిప్పుల పంపిణీ


పాగిరిలో ఓటరు స్లిప్పులు అందజేస్తున్న బీఎల్‌వో వెంకటరమణ

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కంచరాం, పాగిరి, గురవాం తదితర గ్రామాల్లోని ఓటర్లకు ఓటరు స్లిప్పులు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోలంతా ఇంటింటికీ వెళ్లి, ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందజేశారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఈ ఓటరు స్లిప్పుతో పాటు ఆధార్ కార్డును తీసుకువచ్చి, ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని పాగిరి, శ్యాంపురం, నందబలగ గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అక్కడి వాతావరణం ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. పోలింగ్ రోజు నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలతో పాటు దివ్యాంగ ఓటర్ల కోసం ప్రత్యేకంగా ర్యాంప్ ఉండేలా చూడాలన్నారు. ఎండల నేపథ్యంలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్ల కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని బీఎల్‌వోలకు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోండి

బాడంగి: ఎన్నికల విధుల్లోని సిబ్బందికి కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవాలని ఏఆర్‌వో(అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్), తహసీల్దారు ఎన్.రాజారావు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఫారం–12 దరఖాస్తుతో పాటు పోస్టల్ బ్యాలెట్‌ను తీసుకుని, బొబ్బిలి మండలంలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ స్కూల్‌లో ఈ నెల 5, 6, 7వ తేదీల్లో ఓటు వేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏ సమయంలోనైనా ఓటు వేసుకోవచ్చన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబు శర్మ, రేజేటి వంశీకృష్ణల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని కొర్లవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం పరిశీలించిన ఆయన.. ఎండలు రోజురోజుకూ తీవ్రతరమవుతున్నాయని, వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రెండుపూటలా వాతావరణం చల్లగా ఉన్నప్పుడే పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

వలంటీర్ల రాజీనామా

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన 10 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. అనంతరం వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో జి.పైడితల్లికి అందజేశారు. తామంతా స్వచ్ఛందంగానే రాజీనామా చేశామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులు

రేగిడి: విద్యుత్ అంతరాయం తలెత్తకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని కె.ఎం.వలస, వండానపేట, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి తదితర గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్ల మరమ్మతులు శుక్రవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ లావేటి హరి తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం..

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 5వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జ్ ఏఈ హరి శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆమదాలవలస, రేగిడి, మండల కార్యాలయాలకు ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.


తెర్లాంలోని బీసీ పాయింట్ వద్ద పింఛన్ డబ్బుల కోసం వేచిఉన్న లబ్ధిదారులు


తెర్లాం ఎస్‌బీఐ ఆవరణలో పింఛన్‌దారుల పడిగాపులు


పింఛన్ డబ్బుల కోసం వచ్చి, తెర్లాం ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఉన్న వృద్ధులు

చంద్రబాబే ఏడిపించేన్


తెర్లాం: పింఛన్ కోసం పూనువలస నుంచి ఆటో బుక్ చేసుకుని మరీ తెర్లాం ఎస్‌బీఐకి వెళ్తున్న పక్షవాతంతో బాధపడుతున్న పోలయ్య

పింఛన్ కోసం లబ్ధిదారులు నానాపాట్లు పడుతున్నారు. ఉదయాన్నే మండల కేంద్రాలకు వెళ్లి బ్యాంకులు, బీసీ(బ్యాంక్ కలెక్షన్) పాయింట్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రెండోరోజు శుక్రవారం సైతం మండుటెండలో తీవ్రమైన ఉక్కపోతతో కొన్ని గంటల పాటు క్యూలైన్‌లో నిల్చొన్నారు. వలంటీర్ వ్యవస్థ సేవల ద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేస్తోందన్న అక్కసుతో టీడీపీ అధినేత చంద్రబాబు మే నెల పింఛన్‌ను బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఈ మేరకు బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు వేయగా, వాటిని తీసుకునేందుకు పింఛన్‌దారులు అగచాట్లు పడుతున్నారు. ఎన్నికల వేళ రాజకీయం కోసం తమను ఎండల్లో తిప్పించి, తిప్పించి మరీ ఇలా ఏడిపించడం తగునా అని చంద్రబాబును పింఛన్‌దారులు నిలదీస్తున్నారు. వలంటీర్లు ఉన్నప్పుడే బాగుండేదని, వేకువజామునే ఇళ్లకు వచ్చి, పింఛన్ తెచ్చి, ఇచ్చేవారని గుర్తు చేసుకుంటున్నారు. –సాక్షి నెట్‌వర్క్.

చంద్రబాబు కారణంగానే ఈ గతి..



చంద్రబాబు కారణం గానే తమకు ఈ గతి పట్టింది. ఏ ప్రభుత్వం తమకు మంచి చేస్తే ఆ ప్రభుత్వానికే ఓటు వేస్తాం. తమను ఇన్ని ఇబ్బందులకు గురిచేసిన టీడీపీకి తమ ఉసురు తప్పకుండా తగులుతుంది. వారిని మేమే చిత్తుచిత్తుగా ఓడిస్తాం.

–కుర్ల సింహాచలం, వృద్ధాప్య పింఛన్‌దారు, విజయరాంపురం, బాడంగి.


బాడంగి ఎస్‌బీఐలో పింఛన్ డబ్బుల కోసం నానా అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

వలంటీర్లు ఉన్నప్పుడే బాగుండేది..



టీడీపీ కారణంగా పింఛన్ కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. బ్యాంకుల్లో పడిన డబ్బులను తీసుకునేందుకు మండల కేంద్రంలో ఎండలో తిరగాల్సి వస్తోంది. వలంటీర్లు ఉన్నప్పుడే బాగుండేది. ప్రతినెలా ఒకటో తేదీనే ఇళ్లకు వచ్చి, పక్కాగా పింఛన్ ఇచ్చేవారు. మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్న టీడీపీకి ఈ దెబ్బతో ఓటమి తప్పదు.

–బొల్లుంపల్లి సత్యవతి, వృద్ధాప్య పింఛన్‌దారు, ముగడకాలనీ, బాడంగి.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


రామభద్రపురం: రావివలసలో ఎన్నికల ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట 23, 24, 25వ వార్డుల్లో శుక్రవారం పర్యటించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే జగనన్న తపన అని, ఆ దిశగా ఆయన తన ఐదేళ్ల పాలన కొనసాగించారన్నారు. అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. రాష్ట్రంలోని ప్రజలకు మరింత మంచి జరగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించుకోవాలన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఐ.గోపాలరావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్.శ్రీకాంత్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్.వేణుగోపాలనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ టి.పార్వతి, బుడా మాజీ చైర్‌పర్సన్ ఐ.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి..

రామభద్రపురం: ప్రజాసంక్షేమ ప్రభుత్వమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండలంలోని రావివలస, కొండకెంగువ, బూసాయవలస, ముచ్చర్లవలస, ఆరికతోట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలన కొనసాగించారని, గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ఎన్నికల వేళ ఓట్లు కోసం బూటకపు హామీలతో మన ఇంటికి వచ్చే వారిని నమ్మవద్దని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన వారినే నమ్మి ఓట్లు వేయాలని కోరారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చిన సీఎం జగనన్న ప్రభుత్వానికి మద్దతు పలకాలని, ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సింహాచలంనాయుడు, రావివలస, ఆరికతోట సర్పంచ్‌లు కుమారి, పుష్పమ్మ, వైస్ ఎంపీపీలు ప్రసాదరావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

‘కోండ్రు’కు తమ సత్తా ఏంటో చూపిస్తాం..

- మీడియా సమావేశంలో జనసేన పార్టీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ని రాజు


మీడియాతో మాట్లాడుతున్న జనసేన పార్టీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ని రాజు

రాజాం: నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌కు తమ సత్తా ఏంటో చూపిస్తామని జనసేన పార్టీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ని రాజు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడిన ఆయన.. కూటమి అభ్యర్థిగా ఆయనను ప్రకటించిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన సమావేశానికి తాను వెళ్తే కనీస గౌరవం ఇవ్వకుండా అవమానానికి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ ఓట్లు అవసరం లేదని టీవీల్లో ఇంటర్వ్యూలు ఇచ్చిన వ్యక్తికి తాము మద్దతు పలకాల్సిన అవసరం లేదన్నారు. ఆయన ఏనాడూ ప్రజాసమస్యలపై పోరాటం చేయలేదన్నారు. తాము కష్టపడి పార్టీని బలోపేతం చేస్తే టికెట్ ఆయనకు ఇచ్చారన్నారు. రాజాం నియోజకవర్గంలో టీడీపీ కన్నా జనసేన పార్టీనే బలంగా ఉందని, ప్రతీ గ్రామంలోనూ తమకు 200 వరకు ఓట్లు ఉన్నాయన్నారు. రాజాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైతం టీడీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. జనసేన పార్టీ తమను పార్టీ పదవుల నుంచి సస్పెండ్ చేసిందే తప్ప పార్టీ నుంచి కాదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే మళ్లీ జనసేన పార్టీలోకే వెళ్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అప్పలనాయుడు, శ్రావణ్, రామ్‌జీ, దుర్గారావు, హరి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి


లక్ష్మీపేటలో పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు తలాత్ ఫర్వేజ్ ఇక్బాల్

వంగర: ఓటర్లంతా ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేసి, ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు పాటుపడాలని ఎన్నికల పరిశీలకులు తలాత్ ఫర్వేజ్ ఇక్బాల్ కోరారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రమైన లక్ష్మీపేట పోలింగ్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామ వీధుల్లో పర్యటించి, ఈవీఎంల ద్వారా ఓటు వేయడంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటు వేసి, చిత్తశుద్ధి కనబరచాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం సదుపాయాలపై రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఐ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ చిరంజీవి పరాగ్ పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

ప్రచార పర్వం

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. శుక్రవారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన నాయకులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం. –సాక్షి నెట్‌వర్క్.


బొబ్బిలిలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ మహిళా నేతలకు ఘనస్వాగతం పలుకుతున్న పట్టణ ప్రజలు


వంగర: శ్రీహరిపురంలో ఇంటింటికీ వెళ్లి, వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరుతున్న పార్టీ కార్యకర్తలు


తెర్లాం: నెమలాంలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు


రేగిడి: సంకిలిలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, తదితరులు


రాజాం సిటీ: అమరాంలో ఉపాధి హామీ పనుల వద్ద వైఎస్సార్ సీపీ మహిళా నేతల ఎన్నికల ప్రచారం


వంగర: మద్దివలసలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ గణేష్ బెనర్జీ


రేగిడి: చిన్నయ్యపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మహిళలు

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం


రాజాంలోని మల్లిఖార్జునకాలనీలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, 175కి 175 అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ జోష్యం చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పట్టణంలోని మల్లిఖార్జున కాలనీలో శుక్రవారం పర్యటించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లు ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, అన్నిప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మనందరికీ మరింత మంచి జరగాలంటే ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను కూడా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు పిచ్చుక శ్రీనివాసరావు, కాలెపు శేఖర్, మున్నా, దూబ గోపాలం, జినగం ఈశ్వరరావు, కలమట శంకర్, కోల్లా రమ్య, ఆసపు సూర్యం, గుంటముక్కల సప్తగిరి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


రామభద్రపురం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వాసునాయుడు


సంతకవిటి: పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు


రాజాం: ఎమ్మెల్సీ విక్రాంత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత సత్యనారాయణ

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తాడ్డి రామకృష్ణ, తాడ్డి గోవిందరావు, సారిక అప్పలనాయుడులు తమ అనుచరులతో కలిసి ఆ గ్రామ నాయకులు పువ్వల మురళీకృష్ణ, పువ్వల వెంకటరమణల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి శుక్రవారం చేరుకుని, పార్టీలో చేరిన వారందరికీ పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మామిడి వాసునాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతిలు పార్టీ కండువాలు వేసి, సాదరస్వాగతం పలికారు. ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ఇంటింటికీ వివరించి, రానున్న పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరం లబ్ధి పొందామని, ఆయన రుణం తీర్చుకుంటామని పార్టీలో చేరిన వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు టీడీపీని వీడి, శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గార చంద్రరావు, గార రామారావు, గార సేరి, గార వెంకన్న, గార కేశు తదితర కుటుంబాల వారు ఉండగా, వారందరికీ జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగనన్న ప్రజారంజక పాలన నచ్చే తామంతా పార్టీలో చేరామని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తామన్నారు.

రాజాం: మండలంలోని ఇల్లంనాయుడువలస గ్రామానికి చెందిన టీడీపీ నేత బోర సత్యనారాయణతో పాటు 20 కుటుంబాల వారు టీడీపీని వీడి, శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారంతా రాజయ్యపేటలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సమక్షంలో పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాలు వేసి, ఎమ్మెల్సీ ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శాసపు కేశవనాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.